నమస్తే తెలంగాణ
# ఖమ్మం
5 | ఖమ్మం, మంగళవారం 24 జూన్ 2025 | KHAMMAM


కొత్తగూడెం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి వినతి ఇస్తున్నబీఆర్ఎస్ నేతలు


మణుగూరు మండలం సమితిసింగారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



పినపాక మండలం ఏడూళ్లబయ్యారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు


ఇల్లెందు మున్సిపాలిటీ సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న హరిప్రియానాయక్, దిండిగాల రాజేందర్

## కాంగ్రెస్ వచ్చి ఏడాదిన్నర దాటినా..
# బ్లీచింగ్ చల్లే దిక్కులేదు

- పల్లెల్లో పారిశుధ్యం లోపించినా పట్టించుకున్న పాపాన పోలేదు
- ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలుచేసే ధైర్యం లేదు
- పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పారదర్శకత లేనే లేదు
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు
- 'రేగా' పిలుపుతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా ధర్నాలు
- ఎక్కడికక్కడ ప్రభుత్వ అధికారులకు వినతిపత్రాల సమర్పణ


చంద్రుగొండలో ఎంపీడీవో అశోక్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


భద్రాచలం పంచాయతీ ఈవో శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా పల్లెలను పట్టించుకున్న పాపానపోలేదని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విమర్శించారు. గ్రామాల్లోని సైడు కాల్వల వెంట కనీసం బ్లీచింగ్ చల్లే దిక్కు కూడా లేదని దుయ్యబట్టారు. వర్షాలు మొదలై పల్లెల్లో పారిశుధ్యం లోపిస్తున్నా నివారణకు తీసుకున్న చర్యలు లేవని ధ్వజమెత్తారు. పల్లెల్లోని సమస్యలను పరిష్కరించాలని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, 420 హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఇచ్చిన పిలుపుమేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు భద్రాద్రి జిల్లావ్యాప్తంగా సోమవారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. గ్రామాలు, మండలాలు, పట్టణాల్లో ఆయా ప్రభుత్వ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. ఆయా సమస్యలపై అక్కడి అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టి ఏడాదిన్నర దాటినా పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. పాలకవర్గాలు లేని కారణంగా పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతోందని అన్నారు. గ్రామాల్లో బ్లీచింగ్ చల్లించకపోవడం, మురుగు కాల్వలు శుభ్రం చేయకపోవడం, చెత్తను సేకరించి డంపింగ్ యార్డులకు తరలించకపోవడం వంటి కారణాలతో పల్లెల్లో పారిశుధ్యం లోపించిందని ధ్వజమెత్తారు. దీనికితోడు వర్షాలు కురుస్తుండడంతో పల్లెల్లో వ్యాధులు విజృంభిస్తున్నాయని అన్నారు. వీటి నివారణ కోసం ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టలేదని దుయ్యబట్టారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పారదర్శకత లేదని, జాబితాల నిండా అనర్హులేనని విమర్శించారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వం ప్రజల జీవితాలతో ఆటలాడుకుంటోందని దుమ్మెత్తిపోశారు. దోమల నివారణకు చర్యలు లేక, వీధుల్లో వీధి దీపాలు వెలుగక, పారిశుధ్య పనులు ముందుకు సాగక.. భద్రాద్రి జిల్లాలో పల్లెల దుస్థితి గడిచిన 18 నెలలుగా 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే..' అన్న చందంగా ఉందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించకపోతే తమ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. మేనిఫెస్టోలోని హామీలను అమలు చేయకపోతే ఈ సర్కారును ప్రజలు సాగనంపక తప్పదని తేల్చిచెప్పారు. అనంతరం ఆయా కార్యాలయాల్లో ప్రభుత్వ అధికారులకు ప్రజా సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. ఇల్లెందులో అక్కడి మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్, ఉద్యమనేత దిండిగాల రాజేందర్, కొత్తగూడెంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, బీఆర్ఎస్ భద్రాచలం నియోజకవర్గ నేత మానే రామకృష్ణ తదితర ముఖ్య నేతలు అందజేశారు. *-నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జూన్ 23*

# హాఫ్ టైపు మొక్కలెలా వచ్చాయి?

- 26వ తేదీ నుంచి విచారణ చేపట్టనున్న శాస్త్రవేత్తల బృందం
- ఎంపీ వద్దిరాజు ఆధ్వర్యంలో కేంద్ర వ్యవసాయ మంత్రి దృష్టికి సమస్య


ఎంపీ వద్దిరాజు ఆధ్వర్యంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి చౌహాన్‌కు వినతిపత్రం ఇస్తున్న పామాయిల్ గ్రోవర్స్ సొసైటీ నాయకులు(ఫైల్)

దమ్మపేట రూరల్, జూన్ 23 : హాఫ్ టైపు పామాయిల్ మొక్కలపై ఈనెల 26వ తేదీ నుంచి శాస్త్రవేత్తల బృందం విచారణ చేపట్టనున్నది. ఇందు కోసం ప్రశ్నావళిని కూడా రూపొందించారు. 2016–2022 ఏళ్ల వరకు అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం, ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం రేగళ్లపాడులోని ఆయిల్‌ఫెడ్ నర్సరీల నుంచి ఇచ్చిన మొక్కల్లో 20 నుంచి 50 శాతం వరకు జన్యుపర లోపాలతో హాఫ్ టైపు మొక్కలు రైతుల క్షేత్రాల్లోకి చేరాయి. సాధారణంగా మూడేళ్లు పూర్తయిన తర్వాత పామాయిల్ గెలల దిగుబడి వస్తుంది. అయితే దీనికి భిన్నంగా కాత లేకపోవడం, కాత వచ్చినా అతి తక్కువ పరిమాణంతో గెలలు రావడం.. వంటి సమస్యలను తోటలు వేసి ఏడేళ్లు పూర్తయిన తర్వాత కూడా రైతులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని రైతులు ఆయిల్‌ఫెడ్, ఉద్యాన శాఖ అధికారుల దృష్టికి, తెలంగాణ ఆయిల్‌ఫెడ్ పామాయిల్ గ్రోవర్స్ సొసైటీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైంది. దీంతో సొసైటీ ప్రతినిధులు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. రైతుల బాధను అర్థం చేసుకున్న రవిచంద్ర.. సొసైటీ ప్రతినిధి బృందాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా పెదవేగిలోని జాతీయ పామాయిల్ పరిశోధన కేంద్రం విచారణ జరపాలని కేంద్ర వ్యవసాయ మంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. దీనికి అనుగుణంగా పామాయిల్ పరిశోధన కేంద్రం నుంచి తెలంగాణ ఆయిల్‌ఫెడ్‌కు సమగ్ర వివరాలు ఇవ్వాలని సూచిస్తూ ఓ లేఖను పంపించారు. పామాయిల్ రైతుల జాబితా, ఏ రైతుకు ఏ రకం మొక్కలు ఇచ్చారు? ఎంత వయసున్న మొక్కలు ఇచ్చారు? ఏ నర్సరీ నుంచి ఇచ్చారు? ఏ దేశం నుంచి ఎన్ని మొలకలు దిగుమతి చేసుకున్నారు? నర్సరీ ఇన్‌చార్జి పేరు? తదితర 30 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని లేఖలో పేర్కొంది. ఆయిల్‌ఫెడ్ ఇచ్చే నివేదిక ఆధారంగా ఈనెల 26వ తేదీ నుంచి శాస్త్రవేత్తలతో కూడిన బృందం రైతుల తోటల్లో విచారణ చేపట్టనున్నది.

### తప్పును కప్పిపుచ్చుకునేందుకు..

అయితే తాము చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఆయిల్‌ఫెడ్‌లో ప్లాంటేషన్ అధికారి ఆధ్వర్యంలో కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. తాము అవినీతి నుంచి తప్పించుకుని.. రైతులపై తప్పును నెట్టివేయాలనే కోణంలో నివేదిక తయారు చేస్తున్నట్లు సమాచారం. నాటి ఆయిల్‌ఫెడ్ ఎండీ నిర్మల విధించిన రూ.40 లక్షల రికవరీ సొమ్మును చెల్లించకుండా కీలక విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి ఈ నివేదికను రూపొందించడంలో సూత్రధారిగా ఉండడం ఆయిల్‌ఫెడ్ చిత్తశుద్ధికి అద్దం పడుతోంది.

# అనర్హులకు ఇండ్ల మంజూరుపై ఆందోళన

- ఇందిరమ్మ కమిటీలు అవకతవకలకు పాల్పడ్డాయని పిండిప్రోలు గ్రామస్తుల ఆరోపణ
- జీపీ, మండల పరిషత్ కార్యాలయాల ఎదుట గ్రామస్తులు, మహిళల ధర్నా
- ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారి దిగ్బంధం, భారీగా నిలిచిన వాహనాలు

తిరుమలాయపాలెం, జూన్ 23 : ఇందిరమ్మ కమిటీలు ఇండ్ల మంజూరులో అవకతవకలకు పాల్పడాయని, అనర్హులకు ఇండ్లు మంజూరు చేశాయని ఆరోపిస్తూ తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలు గ్రామస్తులు, నిరుపేద మహిళలు గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించి ఆందోళన చేపట్టారు. వీరికి మద్దతుగా బీఆర్ఎస్, సీపీఎం నాయకులు ఆందోళనలో పాల్గొన్నారు. అనంతరం మహిళలు పెద్ద ఎత్తున పిండిప్రోలు బస్టాండ్ సెంటర్‌లో ఖమ్మం–వరంగల్ జాతీయ రహదారిని దిగ్బంధించి రాస్తారోకో చేపట్టడంతో ట్రాఫిక్ భారీగా స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గ్రామస్తులు, మహిళలతో చర్చించారు. అనంతరం ఆందోళనకారులు తిరుమలాయపాలెం చేరుకొని మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎంపీడీవో షేక్ శిలార్ సాహెబ్‌కు వినతిపత్రం సమర్పించారు. పిండిప్రోలు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలో పూర్తిస్థాయి విచారణ జరిపించాలని, జాబితా నుంచి అనర్హులను తొలగించి అర్హులైన పేదలందరికీ ఇండ్లు మంజూరు చేయాలని, ఇందిరమ్మ కమిటీలను వెంటనే రద్దు చేయాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో తిరుమలాయపాలెం సొసైటీ వైస్ చైర్మన్ చామకూరి రాజు, బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి పరికపల్లి చంద్రశేఖర్, చామకూరి సునీల్, శంకర్, సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, పద్మనాభుల సుధాకర్, పప్పుల ఉపేందర్, కాంపాటి బాబు, రామనబోయిన రవి తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారిని దిగ్బంధించి రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామస్తులు

# మాకు న్యాయం చేశాకే ఓసీ సంగతి..

**అప్పటి వరకు పనులు చేస్తే ఊర్కునేది లేదని హెచ్చరిక**

**మణుగూరు తహసీల్ ఎదుట రాజుపేట, విఠల్‌రావు నగర్ గ్రామస్తుల ధర్నా**


మణుగూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రాజుపేట, విఠల్‌రావు నగర్ గ్రామస్తులు

మణుగూరు టౌన్, జూన్ 23 : 'తమను సురక్షిత ప్రాంతాలకు తరలించి పూర్తి న్యాయం చేసిన తర్వాతే సింగరేణి ఓసీ సంగతి చూడాలని, అప్పటి వరకు పనులు చేస్తే ఊర్కునేది లేదు' అని హెచ్చరిస్తూ మణుగూరు మండలం రాజుపేట, విఠల్‌రావు నగర్ గ్రామస్తులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. తొలుత భారీ ప్రదర్శనతో తహసీల్‌కు చేరుకున్న మహిళలు 'మా ప్రాణాలు కాపాండండి..' అంటూ పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల ప్రజలు మాట్లాడుతూ తమ గ్రామాలకు సుమారు 50 మీటర్ల దూరంలోనే ఓసీ ఉన్నదని, దీంతో ఇండ్లలో నివసించే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓసీ ప్రభావంతో ఇండ్ల గోడలు బీటలువారి దుమ్ము ధూళి చేరడంతోపాటు తాగునీరు సైతం కలుషితమవుతున్నాయని, ఆ నీరు తాగడంతో రోగాల బారిన పడుతున్నామని వాపోయారు. గ్రామసభ నిర్వహించకుండా సమావేశం పేరుతో పిలిపించి సంతకాలు చేయించుకోవడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బొజ్జ సదానందం, ఐయితనబోయిన వెంకన్న, మంద కృష్ణ, ఈర్ల రాంకోటి, శ్రీకాకుళం వీరమల్లు, వేల్పుల సుజాత, పుష్పాల అనిత, స్వరూప, తోడేటి వెంకటేశ్వర్లు, సతీశ్, కనకాల సంపత్, పరాల శ్రీను, వెంకట్రాములు, తమ్మిశెట్టి బాలయ్య, బక్క ఉమ, ఏర్పుల గణేశ్, వంగపల్లి పూర్ణ, ప్రభాకర్, తమ్మిశెట్టి బాలయ్య, రాజయ్య, ఉమ, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా

**కేంద్రం తెచ్చిన పెన్షన్ సవరణ బిల్లును నిలిపివేయాలని డిమాండ్**

**బిల్లుతో పెన్షనర్లతోపాటు ఉద్యోగులకూ నష్టం : టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబు**


ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

ఖమ్మం, జూన్ 23 : అపరిష్కృతంగా ఉన్న పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని, కేంద్రం తెచ్చిన పెన్షన్ సవరణ బిల్లును వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ వద్ద గల ధర్నాచౌక్‌లో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కళ్యాణం కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పైడిపల్లి శరత్‌బాబు, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు, టీజీఈజేఏసీ చైర్మన్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడారు. పెన్షనర్ల హక్కులకు భంగం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వం గత మార్చి నెలలో పెన్షన్ సవరణల బిల్లును ఆమోదించిందని, ఇది చట్టంగా రూపొందితే లక్షలాది మంది పెన్షనర్లతోపాటు ప్రభుత్వ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. దీనిపై భవిష్యత్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బయ్య, జిల్లా కార్యదర్శి తాళ్లూరి వేణు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో పెన్షనర్లు పెన్షన్ సవరణ బిల్లును వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శనలు నిర్వహించారని తెలిపారు. పెన్షనర్ల హక్కులకు భంగం కలిగే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.జనార్దన్‌రావు, కోశాధికారి డీకే శర్మ, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు ఆర్.దుర్గాదేవి, జిల్లా కార్యదర్శి తాళ్లూరి వేణు, జిల్లా నాయకులు పూస సాంబశివరావు, వై.ఖాజామోయినుద్దీన్, ఎస్.పూర్ణచంద్రరావు, పి.రాజారావు, కూతురు కృష్ణమూర్తి, బాబూరావు, రాధాకృష్ణ, ఆర్.వెంకటనారాయణ, బసవరావు కృష్ణమూర్తి, ఆదినారాయణ, యు.వెంకటేశ్వర్లు, గురవయ్య, వెంకటేశ్వర్లు, రమేశ్, శంకర్ , ఎం.కృష్ణమోహన్, రిటైర్డ్ పోలీస్ సంఘం జిల్లా బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దాసుపత్రి ఎదుట కార్మికుల రిలే దీక్షలు

**మంత్రి తుమ్మల ఇల్లు ముట్టడిస్తామంటున్న నేతలు**


ఖమ్మం పెద్దాసుపత్రి ఎదుట వేతనాల కోసం రిలే నిరాహార దీక్షకు దిగిన కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు

ఖమ్మం సిటీ, జూన్ 23 : పెండింగ్ వేతనాలపై ప్రభుత్వం ఎంతకూ స్పందించకపోవడంతో విసుగుచెందిన కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు సీఐటీయూ సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట సోమవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ప్రభుత్వానికి, స్థానిక యంత్రాంగానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ క్రమంలో దవాఖాన ఆర్ఎంవో వినాయక్ రాథోడ్ వారి వద్దకు వచ్చి సమ్మె విరమించాలని కోరారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు వై.విక్రం మాట్లాడుతూ కార్మికులకు నిలిచిపోయిన నాలుగు నెలల వేతనాలు ఇప్పించి ఆదుకోవాలని కోరారు. సర్కారు స్పందించకపోతే మంగళవారం నుంచి ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఆ మరుసటి రోజు బుధవారం జిల్లాలోని వివిధ పార్టీలు, కార్మిక సంఘాల మద్దతుతో ఖమ్మం ఎమ్మెల్యే, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి బండి పద్మ, అధ్యక్షురాలు మెరుగు రమ, మాచర్ల భారతి, అమరావతి కార్మికుల దీక్షకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పెద్దాసుపత్రి కార్మిక నాయకులు అంబేద్కర్, మాతంగి అనిల్‌కుమార్, జగదీశ్, అశోక్, వెంకటరమణ, విజయమ్మ, రాములమ్మ, సత్యవతి, మమత, అంజలి, ఉపేందర్, ఉమా, మాధవి, మల్లిక, స్వరూప, సరళ, వసంత పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

**ఖమ్మం కలెక్టర్ అనుదీప్**


సమావేశంలో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

మామిళ్లగూడెం, జూన్ 23 : సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, శ్రీనివాసరెడ్డితో కలిసి అధికారులతో సమీక్షించారు. గత ఏడాది సీజనల్ వ్యాధుల పట్ల తీసుకున్న చర్యల గురించి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కళావతిబాయి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వానకాలంలో వ్యాధులు అధికంగా గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాల్లో వచ్చే అవకాశం ఉందని, వాటి నియంత్రణకు ప్రణాళిక చేయాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించే విధంగా అవగాహన కల్పించాలని, ప్రతి పీహెచ్‌సీ, సబ్‌సెంటర్లలో అవసరానికి మించి 10 శాతం బఫర్‌స్టాక్ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. గురుకులాలు, సంక్షేమ వసతిగృహాలు, ప్రభుత్వ పాఠశాలలో ప్రతిరోజు ఉదయం పిల్లలకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. గత ఏడాది అధిక కేసులు నమోదైన ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా ఎంపిక చేసి అక్కడ ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలన్నారు. లక్షణాలు ఉన్న ప్రతిఒక్కరికి పరీక్షలు చేయాలని, జిల్లాలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ మాటాడుతూ హాస్టల్‌లో ఫుడ్ కమిటీలు వేయాలని, పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌వో పద్మశ్రీ, డీఆర్‌డీవో సన్యాసయ్య, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.